సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 24-1-2025

సంపుటి: 20 సంచిక: 256

పేజీలు: 4 వెల: రూ.1



## అకాన్కాగువాపై కొరికాన ప్లకార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సౌత్ అమెరికా ఖండంలోని ఎత్తయిన అకాన్కాగువా పర్వతాన్ని జిల్లాకు చెందిన ప్రవీణ్‌రాణా అధిరోహించారు. ఈ సందర్భంగా కొరికాన ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొరికాన రవికుమార్ ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నేళ్లుగా చేస్తున్న మంచి కార్యక్రమాలు, ప్రజల జీవితాల్లో తీసుకొస్తున్న వెలుగులను వివరిస్తూ పర్వతంపై ప్లకార్డును ప్రదర్శించాడు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో అతి ఎత్తయిన మౌంట్ ఎవరెస్ట్ (29,028 అడుగులు), మౌంట్ కిలిమంజారో, జపాన్‌లో మౌంట్ ఫ్యూజీ, రష్యాలో ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్, ఆస్ట్రేలియాలో ఎత్తైన కోస్కియుస్కోతో పాటు అనేక పర్వతాలు ఎక్కిన ప్రవీణ్ రాణా సౌత్ అమెరికాలోనే ఎత్తయిన పర్వతం అకాన్కాగువా (22,837 అడుగులు)పై కొరికాన ఫౌండేషన్ రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేయాలని కోరుతూ ప్లకార్డు ప్రదర్శించడంపై శ్రీకాకుళం జిల్లా ప్రజలు అభినందించారు. ప్రవీణ్ రాణా మరిన్ని పర్వతాలు అధిరోహించాలని జిల్లా ప్రజలు కోరారు.

## జాతీయ బాల్ బ్యాడ్మింటన్‌లో
# జిల్లా యువత ప్రతిభ

**ద్వితీయ స్థానం పొంది సిల్వర్ మెడల్ సాధించిన గాయత్రి**

**మరిన్ని విజయాలు సాధించాలి**

**క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే గొండు శంకర్**




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా యువత ప్రతిభ కనబరిచారు. ఎచ్చెర్లకు చెందిన ఎం.గాయత్రి సత్తా చాటి ద్వితీయ స్థానం పొంది సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈమె శ్రీకాకుళం నగరంలో చైతన్య కో-ఆపరేటివ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం హెచ్చ్‌సీ చదువుతున్నారు. వీరి ప్రతిభను గుర్తించి ఎమ్మెల్యే గొండు శంకర్ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు శుక్రవారం అభినందనలు తెలిపారు. మరెన్నో, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైతన్య కోఆపరేటివ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పీజీ పేటలో అధికారులు సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



రింగ్ వలలను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో

# నోట్ల 'రింగు'లో డీడీ



గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు

నిషేధించిన రింగు వలలతో సముద్రంలో చేపల వేట చేపట్టడంపై జిల్లాలో గత కొద్ది రోజులుగా దుమారం నడుస్తోంది. చేపల వేటలో రింగువల వినియోగించడాన్ని ప్రభుత్వం నిషేధించినా జిల్లా మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్ నిర్వాకం వల్ల జిల్లా వ్యాప్తంగా వీటిని వినియోగించి సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడమే ఇందుకు సాక్ష్యం. రింగు వలలు వినియోగిస్తున్న మరబోట్ల యజమాన్యాలు పెద్ద మొత్తంలో మంత్లీలు ముట్టజెప్పడం వల్లే డీడీ శ్రీనివాసరావు కళ్లు మూసుకున్నారని సంప్రదాయ మత్స్యకారుల నుంచి విమర్శలు ఉన్నాయి.



రింగు వలలను అడ్డుకుంటున్న మత్స్యకారులు



- ✔ సంప్రదాయ వేటకు ఆటంకం
- ✔ కలెక్టర్ గ్రీవెన్స్‌లో మత్స్యకారుల ఫిర్యాదు
- ✔ ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోని మత్స్యశాఖాధికారి


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రింగు వలలో చిక్కిన ఏ చేప కూడా మళ్లీ సముద్రంలోకి పోలేదు. మత్స్యసంపద వృద్ధికి అవసరమైన పిల్లచేపలు కూడా ఈ వలలో చిక్కుకుంటాయి. సంప్రదాయ మత్స్యకారులు చేపల వృద్ధి కోసం చిన్న చేపలను వేటాడరు. రింగు వల వేస్తే మాత్రం చిన్న, పెద్ద తేడా లేకుండా చేపలు పెద్ద సంఖ్యలో చిక్కుతాయి. అవి బయటకు పోలేవు. ఎందుకంటే.. రింగువల కన్నాలు అంత చిన్నగా ఉంటాయి. చిన్న చేపలైన నెత్తళ్లు వంటివి కిలోమీటర్ల మేర సమూహాలుగా ఉంటాయి. అర కిలోమీటరు నుంచి కిలోమీటరు వ్యాసార్థం వరకు ఉండే నెత్తళ్ల సమూహాలను సైతం ఈ రింగువలలు చుట్టిపడేస్తాయి. కొన్నాళ్లు అదే పనిగా రింగువలలతో - మిగతా 4లో

# సొంత గనులే 'విశాఖ'కు ఆక్సిజన్








**అనకాపల్లిలో ఆర్సెనల్ మిట్టల్ ప్లాంట్‌కు శంకుస్థాపన, సొంత గనులు**

ఎ.అజశర్మ, ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

- ది వైర్ కోసం..

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకై ఇటీవల కేంద్ర ప్రభుత్వం 11,440 కోట్ల రూపాయల పేకేజీ ప్రకటించింది. దీనితో ప్లాంట్ కష్టాలన్నీ తీరిపోయాయని, ఆంధ్ర రాష్ట్రంలో ఎన్డీయే కూటమి సాధించిన గొప్ప విజయమిదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సహా ముఖ్య నాయకులందరూ ప్రకటిస్తున్నారు. అదే సందర్భంలో ఈ పేకేజీ కేవలం తాత్కాలిక చర్య మాత్రమేనని, అసలు సమస్య ఇది కాదని, ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవడం, సొంత గనులు కేటాయించడం ద్వారా మాత్రమే ప్లాంటు అసలు పరిరక్షణ సాధ్యమని అక్కడి ఉద్యమానికి సారధ్యం వహిస్తున్న పోరాట కమిటీ స్పష్టంగా ప్రకటించింది. వీటి సాధనకై తమ పోరాటం కొనసాగుతుందని కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇందులోని వాస్తవాలను తెలుసుకోవాలంటే కొద్దిగా లోతుకు వెళ్లి, కొన్ని పూర్వాపరాలను పరిశీలించాలి.

2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ సబ్ కమిటీ విశాఖపట్నం స్టీల్ ప్లాంటును వ్యూహాత్మక అమ్మకం చేపట్టాలని - మిగతా 4లో



## పద్మావతి విద్యార్థులకు సంతూర్ స్కాలర్‌షిప్



(సత్యంన్యూస్, నరసన్నపేట)

స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు విప్రో కేర్ సంస్థ వారి సంతూరు స్కాలర్‌షిప్ నిధులు విడుదలైనట్లు కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. చదవుకోవాలనే కోరిక, ఆసక్తి ఉండి కూడా కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో చదువులు కొనసాగించలేకపోతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు సంతూర్ చేయూత అందించిందని ఆయన తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 46 మంది విద్యార్థినులకు రూ.24వేలు చొప్పున విప్రో సంస్థ నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. ఈ మొత్తం విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు తెలియజేసారు. ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు ఈ స్కాలర్ షిప్‌కు అర్హులని తెలిపారు. ఒక్కసారి స్కాలర్ షిప్‌కు ఎంపికైతే కోర్సు ముగిసే వరకు స్కాలర్‌షిప్‌ను పొందవచ్చని తెలిపారు. ఈ పథకం కింద ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులకు 60 శాతం, ఇతర ప్రొఫెషన్ విద్యార్థులకు మిగతా 40 శాతం స్కాలర్‌షిప్‌లు విప్రో సంస్థ కేటాయిస్తుందని తెలిపారు. స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు ఈ మొత్తాన్ని విద్యావసరాలకు వెచ్చించాలని సూచించారు. స్కాలర్‌షిప్ పొందడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



• ఎడిటోరియల్

# వారానికి నలుగురు కుబేరులు

మొన్ననే ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదలైంది. మానవజాతి చరిత్రలో ఇంతకుముందెన్నడూ ఎరగని అసమానతల పర్వం ఇప్పుడు సమాజాన్ని కలవరపెడుతున్నది. ప్రపంచంలో సంపదంతా ఒకవైపు పోగుపడుతుండగా, పేదరికం, దారిద్ర్యం దానికి రెండింతలు వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఇది ఆందోళన కలిగించే అంశం. ప్రతి ఏడాదిలాగే ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సమావేశం ప్రారంభమయ్యే రోజు ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ సంస్థ అసమానతలపై ఓ నివేదికను విడుదల చేస్తుంది. ప్రపంచీకరణ సంస్కరణలు ప్రారంభమైన 1990వ దశకం నుంచి పేదల జీవితాల్లో ఎలాంటి మార్పురాలేదని, కోటీశ్వర్ల సంపద మాత్రం అమాంతం పెరిగిపోయిందని నివేదిక పేర్కొంది. ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో 2024 సంవత్సరంలో 204 మంది చేరారు. అంటే వారానికి సగటున సుమారు నలుగురు వ్యక్తులు కుబేరులవుతున్నారన్నమాట. ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన పది మంది సంపద కరోనా మొదలైనప్పటి నుంచీ ఇప్పటివరకు మధ్య కాలంలో రెట్టింపు కాగా, ప్రపంచ జనాభాలో తొంభైతొమ్మిది శాతం ఆదాయం అదేకాలంలో పడిపోయింది. ప్రజలు పనుల్లేక పస్తులున్నారు. పైసల్లేక విలవిల్లాడారు. ఈ పదిమంది సంపద మాత్రం రోజుకు సగటున రూ.8.60లక్షల చొప్పున పెరిగింది. ప్రపంచ జనాభాలో సుమారు ఇరవై ఐదు లక్షల మంది దగ్గర యాభై లక్షల కోట్ల డాలర్ల సంపద పోగైంది. ఎందుకీ కోటీశ్వరుల సంఖ్య పెరుగుతోంది? కార్మికులను చేస్తున్న దోపిడీ ప్రభుత్వాలు వారికి అండగా నిలవడమే కారణం. సంపదలో 36 శాతం వారసత్వం నుంచి వచ్చిందే. 'కోటీశ్వరుల సంపద మాత్రమే పెరగలేదు, దీంతోపాటు ఆర్థిక రంగంపై వారి పెత్తనం కూడా పెరుగుతోంది' అని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ చెప్పిన మాటల్ని తేలిగ్గా తీసుకోకూడదు, ఎందుకంటే, ఈ రోజు ప్రపంచ దేశాల్ని పన్నులు, సుంకాల రూపంలో పీల్చి పిప్పి చేస్తున్న అగ్రరాజ్యం, దానికి కుబేరుడు ప్రెసిడెంట్ అయ్యాడు. ఆయనకు మద్దతిచ్చిన ప్రపంచంలో అత్యంత సంపన్నుడు 'ఎక్స్' అధినేత ఎలాన్‌మస్క్ ఇతను రాబోయే కాలంలో ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నడుపుతారని వస్తున్న వార్తల్లో ఆశ్చర్యం లేదు. రాష్ట్రాలు, దేశాలు, ఖండాల్లోని ఆర్థిక అసమానతల్లో తేడాలుండొచ్చు, మూలం మాత్రం పెట్టుబడిదారీ విధానమేనన్న సంగతి మరవకూడదు. మన దేశంలో చూస్తే అసమానతలు పెరగడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రధాన కారణం. కార్పొరేట్ల స్వప్రయోజనాల కోసం పాటుపడటం, వారికి లబ్ది చేకూర్చే విధంగా చట్టాల్ని తీసుకురావడం, రూల్స్‌ని రూపొందించడం, యథేచ్ఛగా సాగుతున్న అవినీతికి వంతపడటం. ఇంకా ప్రమాదకరమైన అంశం ఏమిటంటే? పాలకులే ఏకంగా బడా పారిశ్రామికవేత్తలతో మిలాఖత్ అవ్వడం. ఇలాంటి నాయకులు దేశాన్ని ఏలుతుంటే సంపద కొద్దిమంది వద్దే కేంద్రీకరణ కాకుండా ఎలా వుంటుంది? ఇప్పుడు భారత్‌లో జరుగుతున్నది కూడా అదే. మోడీ ఈ పదేండ్ల పాలన చూస్తే సంపద కేంద్రీకరణ విషయంలో అసమానతలు గరిష్ట స్థాయికి చేరి ధనవంతులు కుబేరులయ్యారు. 2022-23 నాటికి దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక్కశాతం మంది సంపద 22.6 శాతం నుండి నలభై శాతానికి ఎకబాకింది. చారిత్రకంగా ఇది అత్యధిక పెరుగుదల. బ్రిటీష్‌వలస పాలన కాలం కన్నా మోడీ హయాంలోనే ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయని ఒక అధ్యయనం వివరించింది. నేలచూపులు చూస్తున్న వినిమయ వస్తుపరిశ్రమ, తలసరి రుణాల పెరుగుదల, పొదుపు రేటు తగ్గడం ఈ వాస్తవానికి బలం చేకూర్చే అంశాలు. స్వాతంత్ర్యం ఆవిర్భవించినప్పటి నుంచి పాలకవర్గాలు చేస్తున్న స్వప్రయోజిత నిర్ణయాలు కార్పొరేట్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.కానీ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆస్థానంలో అదనంగా కులం, మతం, ప్రాంతం చేరాయి. ఇవి ప్రజల్ని విభజించి పాలించే విధానానికి దోహదం చేస్తున్నాయి. నేడు కేంద్ర పాలకులు అదానీ, అంబానీలాంటి కార్పొరేట్లకు కట్టబెట్టే భూగర్భ గనులు, విమానాశ్రయాలు, రైల్వేలు, టెలికాం, విద్యుత్ ఇవన్నీ కూడా భారత ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా భారాలు వేసే చర్యలే! పాలకులు అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాల ఫలితమే అసమానతల స్థాయి పెరగడానికి కారణం. ఇది పేదరికాన్ని మరింత పెంపొదిస్తున్నది. ఉపాధిని కబళిస్తున్నది. ఉద్యోగాల ఊసే లేకుండా చేస్తున్నది. ప్రజల్ని మరింత దారిద్ర్యానికి దిగజారుస్తున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ దిగ్గజాలకు రూ.16 లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాల్ని మాఫీ చేసింది మోడీ సర్కార్. ఈ డబ్బంతా ఎవరిది? ప్రజలదే కదా. అందుకే ప్రపంచ ఆకలిసూచీలో మన దేశానిది నూట ఐదవ స్థానం.

# బాలికలు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొడ్డూరులో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు దేశంలో అమలు జరుగుతున్న భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం ప్రారంభించి 10సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశంలో మహిళలు, బాలికలలో ఎంతో అభివృద్ధి కనబడిందని తెలిపారు. బాలికలకు విద్య, ఉద్యోగాల్లో అన్ని రంగాలలో మూడోవంతు రిజర్వేషన్ అమలు జరుగుతున్నాయని, వాటిని చదువుకొని వినియోగించి ఉద్యోగాలు సంపాదించాలని కోరారు. ఇప్పటికే మొత్తం ఉపాధ్యాయుల్లో 53% మహిళా ఉపాధ్యాయులు మొత్తం డాక్టర్లలో 60% మహిళా డాక్టర్లు ఉన్నారని మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. అందువల్ల బాలికలందరూ క్రమశిక్షణ అలవర్చుకొని మంచి ఉద్యోగాలు సంపాదించాలని సూచించారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థినులు బాలికలకు, మహిళలకు గల అవకాశాలను తెలియజేశారు. ముఖ్యంగా బాలికలు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, జీవితంలో సరైన స్థానం సంపాదించి వివాహం చేసుకోవాలని సూచించారు.

అదేవిధంగా బాలికలందరూ ఆరోగ్య సూత్రాలను పాటించి పౌష్టికాహారం పరిశుభ్రతను పాటించి అభివృద్ధి చెందాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. మల్లేశ్వరరావు, ఆంగ్ల ఉపాధ్యాయులు అదపాక దామోదరరావు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ బాలికల సమస్యలు వాటిని అధిగమించడం గురించి మాట్లాడారు.



# బాల్ బ్యాడ్మింటన్ విజేతకు అభినందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఈనెల 17 నుంచి 21 వరకు నాగపూర్ మహారాష్ట్రలో జరిగిన జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌లో ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. ఇందులో శ్రీకాకుళం జిల్లా నుంచి బాలుర విభాగంలో జి.లక్ష్మణ, ఎస్.హేమంత్, బాలికల విభాగంలో ఎస్.నందిని, ఎం.గాయత్రిలు ఎంపికయ్యారు. వీరందరూ ఎచ్చెర్ల మండలానికి చెందినవారు. వీరిని బాల్ బ్యాడ్మింటన్ సంఘ చైర్మన్ డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందజేసి అభినందించారు.

## అసిరితల్లి ఉద్యోగ సేవా సంఘం ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కరజాడ గ్రామానికి చెందిన బలగ రామారావు కుమారుడు, బలగ తేజేశ్వరరావు వయస్సు 20 సంవత్సరాలు. ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని కాలు విరిగిపోయింది. మెరుగైన వైద్యం కోసం వైజాగ్ తీసుకొనివెళ్లగా, పరీక్షించిన వైద్యులు సుమారు రూ.4లక్షలు వరకు అవుతుందని తెలిపారు. తేజేశ్వరరావు పేద కుటుంబం కావడంతో, వైద్యానికి ఇబ్బందిపడుతున్నారని స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న, అసిరితల్లి ఉద్యోగ సేవా సంఘం కరజాడ గ్రామస్తులు స్పందించి, కుటుంబసభ్యులకు రూ.25వేలు ఆర్థిక సహాయం అందించి మాట్లాడుతూ ప్రమాదాలు ఎవరికీ చెప్పిరావని, మన జాగ్రత్తలో మనం ఉండాలన్నారు. వాహన చోదకులు నిదానమే ప్రధానంగా భావించి, కుటుంబసభ్యులను దృష్టిలో పెట్టుకొని అన్నింటిలో జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో తేజేశ్వరరావు కుటుంబసభ్యులు, అసిరితల్లి ఉద్యోగ సేవాసంఘం సభ్యులు రమణయ్య, భాస్కరరావు, వీర్రాజు, శ్రీనివాసరావు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# వదంతులకు, సరదాలకు ఒక సందర్భం ఉండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వదంతులకు, సరదాలకు ఒక సందర్భం ఉండాలని, అందుకు తగిన మూల్యం 12 మంది ప్రాణాలు కోల్పోయారని ప్రమాద ఘటన మనోవేదనకు గురిచేసిందని, ఈస్ట్‌కోస్ట్ వాల్తేరు డివిజన్ శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ డెవలప్మెంట్ మెంబెర్ పొన్నాడ రవికుమార్ అన్నారు. ముంబయి పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయన్న వదంతి మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో ఘోరప్రమాదానికి దారితీసిన విషయం తెలిసిందే. దీనిలో 12మంది ప్రాణాలు కోల్పోవటం బాధాకరమని పొన్నాడ రవికుమార్ అన్నారు. ఇందులో 15మంది గాయపడగా, ముంబయికి 400కి.మీ. దూరంలోని మహేజి-పర్దాడె స్టేషన్ల మధ్య బుధవారం సాయంత్రం 4.45 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ముంబయి పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు వచ్చాయని తొలుత కలకలం రేగింది. తమకు మంటలు అంటుకుంటాయనే ఆందోళనతో చైన్ లాగి, హడావుడిగా కిందికి దిగిన ప్రయాణికులు, పక్కనున్న మరో ట్రాకు పైకి చేరారు. అదే సమయంలో ఆ ట్రాకుపై గంటకు 130-140కి.మీ వేగంతో దూసుకు వస్తున్న 12627 బెంగళూరు-న్యూఢిల్లీ కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు వారిని ఢీకొట్టడంతో క్షణాల్లో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. రైలు ఆగుతుండగా ప్రయాణికులు రెండువైపుల ప్రయాణీకులు కిందికి దూకారని, వారిలో అవతలి ట్రాకువైపు దిగినవారు ప్రమాదానికి గురయ్యారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారన్నారు. గాయపడినవారికి ప్రాణాపాయం లేదని మహారాష్ట్ర మంత్రి గిరీశ్‌మహాజన్ చెప్పారు. మంటలు చెలరేగాయనే వదంతులు వ్యాప్తి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలపగా, రైలు ప్రమాదంపై రైల్వే భద్రత కమిషనర్ (సెంట్రల్ సర్కిల్) మనోజ్ అరోడా విచారణ జరపనున్నారు. మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా విచారం వ్యక్తంచేశారు. క్షతగాత్రుల వైద్యఖర్చుల్ని ప్రభుత్వమే భరిస్తుందని దావోస్ అన్నారని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.




# సైఫ్‌కు పెద్ద దెబ్బే పడింది!

వారం క్రితం హత్యా యత్నం నుండి బయటపడి కోలుకుంటున్న సమయంలో ఈసారి తన పూర్వీకుల ఆస్థులు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది! అసలేం జరిగింది? సైఫ్ అలీ ఖాన్‌కి తన పూర్వీకుల నుండి సంక్రమించిన 15,000 కోట్ల ఆస్థులు ఉన్నాయి. 2014లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం కాస్టో డియన్ అఫ్ ఎనిమీ ప్రపోర్టీ డిపా ర్ట్మెంట్ సైఫ్ అలీ ఖాన్‌కి నోటీ సులు ఇచ్చింది. నోటీసుల సారాంశం ఏమిటంటే..

ఎనమీ ప్రాపర్టీ యాక్ట్ 1968, 2016ల కింద సైఫ్ అలీఖాన్ అనుభవిస్తున్న ఆస్థులు ఏవైతే ఉన్నాయో వాటిని కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో చెప్పాలని. నోటీసులకి స్పందించిన సైఫ్ అలీఖాన్ 2015లో భోపాల్ హై కోర్టులో సవాల్ చేశాడు. భోపాల్ హైకోర్టు స్టే ఇచ్చింది విచారణ అయ్యే వరకూ ఎలాంటి చర్య తీసుకోకుండా. 2024 డిసెంబర్ 13లో మధ్యప్రదేశ్ హైకోర్ట్ స్టే ఎత్తి వేస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు చట్టబద్ధంగానే ఉన్నాయని ఒక వేళ సైఫ్ అలీ కావాలని అనుకుంటే అప్పిలెట్ ట్రైబ్యునల్ లో 30 రోజులలోపు అపీల్ చేసుకోవచ్చని సమయం ఇచ్చింది!

ఈ రోజుతో 30 రోజుల గడువు ముగిసి పోయింది! కానీ సైఫ్ అలీ ఖాన్ అప్పిలెట్ ట్రిబ్యునల్ లో అపీల్ చేయలేదు! టెక్నీకల్‌గా 15,000 కోట్ల ఆస్థి కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి వీలు ఉంది ఈ రోజుతో!

**హైకోర్టు 30 రోజులు గడువు ఇచ్చినా సైఫ్ అలీఖాన్ ఎందుకు అప్పిలెట్ ట్రిబ్యునల్‌లో అపీల్ చేసుకోలేదు? ఎందుకంటే Enemy Property Act 1968, 2016లు చాలా స్పష్టంగా ఉన్నాయి.**

## Enemy Property Act 1968!

శత్రుదేశంగా గుర్తించబడ్డ దేశం, ఆ దేశం యొక్క పౌరుల ఆస్తులని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది ఎనిమి ప్రాపర్టీ యాక్ట్ 1968. దేశ విభజన తరువాత పాకిస్థాన్‌తో యుద్ధం చేయడం వలన పాకిస్థాన్, చైనాతో జరిగిన యుద్ధం వలన చైనా దేశాలని శత్రు దేశాలుగా పరిగణిస్తూ ఆయా దేశాల ఆస్థులు భారత్‌లో ఉన్నా, ఆయా దేశాల ప్రజల ఆస్థులు మన దేశంలో ఉన్నా వాటిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. మొహమ్మద్ అలీ జిన్నా ఆస్తులని మన ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వేలం వేసింది. అలాగే మాజీ పాకిస్థాన్ అధ్యక్షుడు ముషరాఫ్ ఆస్తులని స్వాధీనం చేసుకొని వేలం వేశారు. ముంబై పేలుళ్ల సూత్రధారి దావూద్ ఇబ్రహీం ఆస్తులని కూడా వేలం వేశారు. అయితే ఎనిమి ప్రాపర్టీ యాక్ట్ 1968లో కొన్ని లూప్ హోల్స్ ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం 2016లో ఎనిమి ప్రాపర్టీ యాక్ట్ 1968 ని సవరించి కొత్త చట్టం చేశారు.

2017లో పార్లమెంట్‌లో The Enemy Property (Amendment and Validation) Bill ఆమోదం పొంది చట్ట రూపం దాల్చింది.

కొత్త చట్టం ప్రకారం శత్రువు ఎవరు, శత్రువుకి చెందిన వ్యక్తిగత ఆస్థులు, వ్యాపారాలు వాటిని ఎలా గుర్తించి స్వాధీనం చేసుకోవాలి లాంటి అంశాలకి స్పష్టంగా వివరించింది. The Public Premises (Eviction of Unauthorised Occupants ) Act of 1971 ని కూడా సవరించి కొత్త చట్టంలో వివరంగా చెప్పారు.

కొత్త చట్టం ప్రకారం దేశం వదిలి పాకిస్థాన్ లేదా చైనా పారిపోయిన లేదా వలస వెళ్లిన వారి ఆస్తుల వారసులు ఎవరు, వాళ్లకి ఆస్తిలో హక్కు ఉంటుందా లేదా అన్నది స్పష్టంగా చెప్తున్నది! ఒకవేళ భారత్‌లో ఉన్న భాగస్వాములకి పారిపోయిన వ్యక్తికి చెందిన వ్యాపారంలో ఎలాంటి హక్కులు ఉంటాయో కొత్త చట్టంలో వివరించారు!

కొత్త చట్టం ప్రకారం దేశంలోని ఏ సివిల్ కోర్టుకి ఎనిమి యాక్ట్ కిందకి వచ్చే వివాదాల కేసులని విచారణకి స్వీకరించి విచారణ చేసే అధికారం ఉండదు. ఇది జాప్యం లేకుండా పరిష్కారం కావడానికి దోహద పడుతుంది.

పాత చట్టాన్ని సవరించడానికి కారణం దావుద్ ఇబ్రహీం కేసులో లోపాలు బయటపడడమే! So! సైఫ్ అలీ ఖాన్ కేసులో ఉన్న మతలబు ఏమిటీ? సైఫ్ అలీఖాన్ పటౌడికి ఆస్థులు వాళ్ళ నాన్న మన్సూర్ అలీ ఖాన్ పటౌడి ద్వారా సక్రమించినవే! భోపాల్ నావాబు హామీదుల్లా ఖాన్ 1960లో చనిపోయాడు. వారసురాలిగా అతని పెద్ద కూతురు అబిదా సుల్తానా గా అప్పటి ప్రభుత్వం గుర్తించింది! కానీ అబిదా సుల్తానా తన తండ్రి మరణానికి ముందే అంటే 1950 లో పాకిస్తాన్ వెళ్ళిపోయింది తన భారత పౌరసత్వాన్ని వదులుకొని. అబిదా సుల్తానా చెల్లులు అయిన సబియా సుల్తానాని వారసురాలిగా గుర్తించారు.

ఎనిమి ప్రాపర్టీ యాక్ట్ 1968లో అమలులోకి వచ్చింది కాబట్టి తమ ఆస్థులు భద్రంగానే ఉంటాయని భావించారు.

కానీ అసలు వారసురాలు అబియా సుల్తానా పాకిస్థాన్ వెళ్ళిపోయింది కాబట్టి ఆ ఆస్తుల మీద మిగతా వారసులకి హక్కులు ఉండవు సవరించిన చట్ట ప్రకారం. భారత ప్రభుత్వంకి చెందుతాయి! 1968 లో Enemy Property Act అమలులోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం చూసి చూడనట్లు వదిలేసింది. అయితే ఎవరు శత్రు దేశానికి వెళ్లారు, వాళ్ళ ఆస్తులకి వారసులు ఉంటే ఏం చేయాలి అన్న దాని మీద 1968 యాక్ట్ లో వివరాలు లేవు. దాని వల్ల వివాదాలు సివిల్ కోర్టులలో దశబ్దాల తరబడి నానుతూ వచ్చాయి.

2016 సవరించిన బిల్లులో ప్రతీ ఒక్క అంశాన్ని స్పృశిస్తూ స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే సివిల్ కోర్టుల జోక్యానికి అవకాశం లేకుండా చేశారు. 15,000 కోట్ల ఆస్తులకి వారసురాలు పాకిస్తాన్ వెళ్ళిపోయింది (1950) కాబట్టి అది శత్రు దేశానికి చెందిన ఆస్తిగానే పరిగణిస్తారు! 1947 దేశ విభజన తరువాత భారత్ నుండి ఎవరైతే పాకిస్తాన్ వెళ్లిపోయారో వాళ్ళ ఆస్థులు ఆటోమాటిక్‌గా కేంద్రప్రభుత్వ అధీనంలోకి వెళ్ళిపోతాయి. ఈ కేసులో భోపాల్ నవాబు హామీదుల్లా ఖాన్ వారసుడిగా బ్రతికే ఉన్నాడు 1960 వరకూ కాబట్టి అలానే కొనసాగాయి ఆస్థులు కానీ హామీదుల్లాఖాన్ చనిపోయాక అతని వారసురాలు పాకిస్థాన్ వెళ్ళిపోయింది కాబట్టి ఇక వారసత్వం అంటూ ఏమీ ఉండదు. సబియా సుల్తానాకి సైఫ్‌అలీఖాన్ మనవడు (మన్సూర్ అలీఖాన్‌కి తల్లి) అవుతాడు. ఆస్థి దక్కాల్సింది అబిదా సుల్తానాకి కానీ ఆవిడ పాకిస్థాన్ వెళ్లిపోవడం వలన సబియా సుల్తానాకి తరువాత మన్సూర్ అలీఖాన్ పాటౌడి తరువాత సైఫ్ అలీఖాన్‌కి వచ్చింది.2015 నుండి 2024 డిసెంబర్ వరకూ మధ్యప్రదేశ్ హైకోర్టులో వారసత్వం మీద విచారణ జరిగింది! చివరిగా 2024 డిసెంబర్ 13న మధ్యప్రదేశ్ హైకోర్టు సింగిల్ జడ్జి సైఫ్ అలీఖాన్, తల్లి షర్మిలా ఠాగూర్‌ల పిటిషన్‌ని కొట్టివేస్తూ పిటిషనర్లు అప్పిలెట్ ట్రిబ్యునల్‌లో అపీల్ చేసుకోవడానికి 30 రోజుల గడువు విధించింది! ఒక వేళ అప్పిలెట్ ట్రిబ్యునల్‌లో 30 రోజుల లోపు అపీల్ చేయకపోతే చట్ట ప్రకారం ఏవైతే నోటీసులు ఇచ్చారో అవి అమలులోకి వస్తాయని పేర్కొంది!

So! తీర్పు స్పష్టంగా ఉంది! 2025 జనవరి 13కి నెల రోజుల గడువు ముగిసింది కానీ సైఫ్, షర్మిల ఠాగూర్‌లు అపీల్ చేయలేదు! బహుశా గత 9 ఏళ్లుగా హైకోర్టులో జరిగిన వాదనల వల్ల వాళ్ళతో పాటు వాదించిన అడ్వకెట్లకి కూడా అర్థమై ఉంటుంది కేసుని అపీల్ చేసినా ఉపయోగం ఉండదు అని. 1947 నుండి ఇప్పటి వరకూ తగిన చర్య తీసుకోని ఆస్థులు ఎన్ని ఉన్నాయి? RTI ద్వారా బయటికి వచ్చిన వివరాల ప్రకారం 12,983 వేల స్థిర ఆస్థులు ఎనిమి ప్రాపర్టీ యాక్ట్ పరిధిలో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 5,688 స్థిర ఆస్థులు స్వాధీనం చేసుకోవాల్సినవి ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 4,354వేల స్థిర ఆస్థులు స్వాధీనం చేసుకోవాల్సినవి ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో ఇప్పటికి సర్వే జరుగుతూనే ఉన్నది కానీ సైఫ్, షర్మిల ఠాగూర్‌లకి సంబంధించి ఆస్థులు ఇంకా సర్వే చేస్తూనే ఉన్నారు. సైఫ్ అలీఖాన్ మీద హత్యా ప్రయత్నం అనేది తన ఆస్థుల పోవడం మీద నుండి దృష్టి మరల్చడం కోసమే అని అనిపిస్తున్నది. హత్యయత్నం చేయడానికి వచ్చిన వాడు వెస్ట్ బెంగాల్ నుండి వచ్చి ముంబైలో ఉంటున్నాడు కానీ అతను బంగ్లాదేశ్ నుండి వెస్ట్ బెంగాల్‌లోకి అక్రమంగా ప్రవేశించి ఆపై ముంబై వచ్చాడు. ఈ కేసుకి సంబంధించి ముంబై క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ దయానాయక్‌కి అప్పచెప్పడం మీద మొదట ఆశ్చర్యం కలిగినా ఇప్పుడు అర్థం అవుతున్నది కేసుని రాజకీయ ప్రయోజనం కోసం వాడుకోవడానికి అఖిలేష్‌యాదవ్, మమతా బెనర్జీలు సిద్ధంగా ఉన్నారని తెలుసుకొని దయానాయక్ (అబ్‌తక్‌చ్చప్పన్ నానాపటేకర్) ని ఎందుకు నియమించారో అని. అన్నట్లు సైఫ్ అలీ సోలోగా నటించిన 'జ్వెవెల్ తీఫ్ ' త్వరలో విడుదల అవబోతున్నది! ఇంతకీ వీళ్ళు నావాబులా? Md. ఫైజ్ తలాబ్ ఖాన్ అనే అతను ఆఫ్ఘనిస్తాన్‌లోని కందహార్‌లో బరేచ్ ట్రైబ్ కి చెందిన వాడు. చెరువులు తవ్వడం, పూడిక తీయడం వృత్తి. అప్పటి బ్రిటీష్ ఇండియా కి వలస వచ్చి చిన్న చిన్న పనులు చేసుకుంటూ బ్రతికేవాడు. బ్రిటీష్ వాళ్ళు మరాఠా రాజుతో (Anglo Maratha war) యుద్ధం చేస్తున్న సమయంలో బ్రిటీష్ తరుపున యుద్ధంలో పాల్గొన్నాడు!

తరువాత బ్రిటీష్ వాళ్ళు ఈ ఫైజ్ తలాబ్ ఖాన్‌కి హర్యానాలోని గుర్గావ్ దగ్గర ఉన్న పటౌడి అనే గ్రామాన్ని ఇచ్చారు. అప్పట్లో చిన్న చిన్న గ్రామాలు కలిపి ఒక చిన్న రాజ్యంగా ఉండేవి. తలాబ్ అంటే చెరువు అని అర్థం కాబట్టి చిన్నతనంగా ఉంటుంది అని పటౌడిని తగిలించుకొని తలాబ్‌ని వదిలేశారు. అప్పట్లో నెహర్ (కాలువ) పక్కన ఉండే వాళ్ళని నెహర్ లు అని పిలిచేవారు అది క్రమంగా నెహ్రూ అయ్యింది! అసలికి జామిందార్ అని పిలవచ్చు కానీ చెప్పుకోవడానికి క్లాస్‌గా ఉంటుందని నవాబ్ తగిలించుకున్నారు! పటౌడి, నవాబ్‌లు తగిలించుకున్నవే! అసలు పేరు తలాబ్ సైఫ్ అలీఖాన్ పిలవాలి! Md.ఫైజ్ తలాబ్ ఖాన్ సంతానం అందరూ దేశ విభజన తరువాత పాకిస్థాన్ వెళ్ళిపోతే సైఫ్ ముత్తాత ఒక్కడే భారత్‌లో ఉండిపోయాడు! వీళ్ళ మాతృ భాష పష్తో లేదా పష్తూన్! ఇవన్నీ తెలిసి కూడా జాతీయ మీడియా ఇంకా నవాబ్ పటౌడి అని పిలుస్తాయి ఇప్పటికి! దేశ విభజన జరిగిన తరువాత పాకిస్థాన్ లోని హిందువుల ఆస్థులు ఆక్రమణకి గురయ్యాయి కానీ మన దేశంలో మాత్రం నావాబుల పేరుతో చెలామణి అవుతూ హాయిగా ఆస్తులని అనుభవిస్తున్నారు!



బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావును ఆ పార్టీ సీనియర్ నాయకులు, ఈస్ట్ మండల అధ్యక్షులు పైడి రాజారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బి.నాగు, బి.కృష్ణ, పైడి సాంబమూర్తి, బి.సన్నిబాబు, సనపల ముకుందరావు, కోటబొమ్మాళి మండల నాయకులు మెట్ట తిరుమలరావు, బి.దివాకర్, కిల్లి లక్ష్మణ్, ఉప్పాడ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## సుడా చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు


(సత్యంన్యూస్, పలాస)

శ్రీకాకుళం నగర అభివృద్ధి సంస్థ (సుడా) చైర్మన్, పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు కొరికాన రవికుమార్‌ను ఆయన కార్యాలయంలో పలాస జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుడా పరిధిలో తీసుకువస్తున్న గణనీయమైన మార్పులు, అలాగే సుడా పరిధిలోని పట్టణాల సుందరీకరణ, జిల్లా కేంద్రం శ్రీకాకుళం నగర అభివృద్ధి, సుందరీకరణ గుర్చి తీసుకున్న చర్యలు హర్షణీయమని ఈ సందర్భంగా కొనియాడారు. శ్రీకాకుళం నగరం తర్వాత జిల్లాలో పెద్ద పట్టణమైన పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల సుందరీకరణ, అభివృద్ధి దిశగా కూడా ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి అంపోలు హరీష్ కుమార్, సంయుక్త కార్యదర్శి సురేష్ లావేటి, నియోజకవర్గ సీనియర్ నాయకులు కోన కృష్ణారావు, క్లష్టర్ ఇంఛార్జ్ వంశీ కృష్ణ చౌదరి, యువ నాయకులు పత్తి ఉదయ్‌కుమార్‌లు ఉన్నారు.



# “భారతీయత... చేనేత...!” చిత్రానికి రాష్ట్ర అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నగరానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటకుల ఆదరణ పొందిన వెబ్ ఛానెల్ టీవీ టూరిజం వారి సమర్పణ లో ప్రముఖ దర్శకుడు, రచయత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ మణిభూషణ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన డాక్యుమెంటరీ చిత్రం “భారతీయత... చేనేత...!” చిత్రానికి జాతీయ చేనేత దినోత్సవ వేడుకలో జరిగిన పోటీలో ఉత్తమ రాష్ట్రస్థాయి చిత్రంగా అవార్డు వరించింది. ఈమేరకు ఈ అవార్డును శుక్రవారం మంగళగిరిలో గల డిపార్మెంట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ కార్యాలయంలో కమీషనర్ శ్రీరేఖ రాణి చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ మణిభూషణ్ స్వీయ దర్శకత్వంలో పొందూరు ఖాదీపైన తీసిన లఘు చిత్రం, అలనాటి నుండి ఈనాటి వరకు ఖాది ప్రాముఖ్యతను వివరించిందన్నారు. ఈ అవార్డు వారి కీర్తి కిరీటంలో మరొక మణిగా నిలుస్తుందన్నారు. మణిభూషణ్ మాట్లాడుతూ ఎన్నో విభిన్న చిత్రాల ద్వారా ఎన్నో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న తనకు ఈ అవార్డు గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. జాతిని మేల్కొలిపే అవకాశం ఇచ్చిందన్నారు. పొందూరు ఖాది చేనేత విశిష్టత గురించి ఎంత చెప్పిన తక్కువేనన్నారు. పొందూరు ఖాదీ అంటే కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి, ఒక చరిత్ర, ఒక గ్రామం యొక్క ఆత్మ అని పేర్కొన్నారు. చేతితో వడికిన నూలుతో, చేమగ్గం మీద నేసిన ఈ వస్త్రం దేశంలోనే అత్యంత సన్నటి ఖాదీగా పేరుగాంచిందన్నారు. ఈ ఖాదీ శరీరానికి చాలా ఆరోగ్యకరమని, ఇది చర్మ సమస్యలను తగ్గిస్తుందన్నారు. ఈ రాష్ట్రస్థాయి అవార్డు మరింత ఉత్సాహం అందించి రోబోయే రోజుల్లో మరిన్ని సమాజాన్ని తట్టిలేపే చిత్రాలు తన దర్శకత్వంలో ప్రజలకు అందిస్తానన్నారు. ఈ చిత్రానికి సహాయ సహకారం అందించిన, హీరో ఆదిత్యభూషణ్, ఎడిటర్ నీరజ, వాయిస్ చైతన్య, కెమెరా కిషోర్, పొందూరు చేనేత కార్మికులు, సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈనెల 25న టీవీ టూరిజం ఆరవ వార్షికోత్సవ వేడుకల్లో టీవీ టూరిజం ఛానెల్‌లో ప్రజలకు విడుదల చేస్తున్నామన్నారు.

# బైక్‌ర్యాలీ జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా శ్రీకాకుళంలో ఈనెల 26న నిర్వహించనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీలు పిలుపునిచ్చాయి. శ్రీకాకుళం సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 13నెలల పాటు సాగిన రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలివేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాలలోని విధానాలతోనే తిరిగి కొత్త చట్టాలుగా తీసుకువస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సహకారచట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం క్రిందకు తెచ్చేందుకు చేసిన వేనన్నారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు, పాడి సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలను కార్పొరేట్ కంపెనీల గొడుగు క్రిందకు చేర్చడమే లక్ష్యంగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా జారీచేసిన వ్యవసాయ మార్కెట్ల జాతీయ విధానం చట్టం ప్రకారం మొత్తం విధానాలను వ్యవసాయాధారిత పరిశ్రమాధిపతులు, ఎగుమతి, దిగుమతి దారులు, విదేశీ వ్యాపారులు రైతుల పంటలను స్వేచ్ఛగా కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం, ఎగుమతి చేసుకోవడానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తుందని, విద్యుత్ సవరణ చట్టాన్ని,



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పూనుకుంటోందని విమర్శించారు. రైతులు కోరుతున్న సి2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం, రైతులు, వ్యవసాయ కార్మికుల రుణ విముక్తి చట్టం, ఆహార భద్రత చట్టం కొనసాగింపు, ఉపాధి హామీ పథకం విస్తరణ, కౌలు రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కార్మికులకు నష్టకరమైన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దు చేయించడం కోసం మరింత తీవ్రంగా పోరాడవలసి ఉందన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, ఉద్యోగులు కార్మికులు శ్రీకాకుళం 7రోడ్ల జంక్షన్ నుండి సూర్యమహాల్ మీదగా రామలక్ష్మణ జంక్షన్ వరకు జరిగే మోటార్ బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చిక్కాల గోవిందరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీపాన వెంకట్రావు, సిఐటియు నాయకులు ఎ.సత్యం, ఆర్.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఆడపిల్లలని రక్షిద్దాం, ఆడపిల్లలని చదవనిద్దాం అనే నినాదంతో మండలంలోని బుడగట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న రాణి వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో మహిళలు, ఆడపిల్లలను చదివించడంతోపాటు, వారి స్వీయ రక్షణకై విద్యార్థినులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహ హింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నిరాశ్రయులైన ఆడపిల్లలకు, మహిళలకు జిల్లా మహిళా, శిశు అభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న హోమ్స్ ఉన్నాయని తెలిపారు. ఆడపిల్లలకు మహిళలకు ఎటువంటి కష్టం కలిగిన 100, 1098, 181, 112 హెల్ప్ లైన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఆపద సమయంలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తంగా వన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనరావు, సెక్రటరీ హసీనా, మహిళ కానిస్టేబుల్ ప్రమీల, ఇతర భోధన సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మండలంలోని నిమ్మ తోర్లువాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పట్టా సూర్యనారాయణ గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.12లక్షల చెక్కును నెలరోజుల క్రితం స్వయంగా హైదరాబాద్ వెళ్లి అందజేశారు. ఇదిలా ఉండగా మరో రూ.2.5లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. దీంతో ఈ చెక్కును పట్టా సూర్యనారాయణ కుటుంబ సభ్యులకి వండాన ఉదయ్‌కుమార్ ద్వారా రవికుమార్ అందజేశారు. దీంతో మొత్తం రూ.14.5లక్షలు అందినట్లయింది. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే కూనరవికుమార్ పని చేస్తున్నారన్నారు.



## ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

(సత్యంన్యూస్, టెక్కలి)

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ మేరకు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## రక్తదానం చేయండి..! ప్రాణదాతలు కండి..!

(సత్యంన్యూస్,టెక్కలి)



ఈనెల 26 రిపబ్లిక్‌డే సందర్భంగా టెక్కలి అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని టెక్కలి జిల్లా హాస్పిటల్‌లో ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గలో వున్న యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తారని అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మన కళ్ళ ముందే ఎంతోమంది రోగులు సరైన సమయానికి రక్తం అందక ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. కనుక ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో రక్తదానం చేయడానికి ముందుకు వస్తారని అయన కోరారు. రక్తదానం చేయాలనుకున్న వాళ్ళు 9441116108 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.




స్థానిక బలగ నాగావళి తీరంలో వెలిసిన శ్రీ బాలత్రిపుర కాలభైర పీఠం దేవాలయానికి విచ్చేసిన శ్రీ దత్తా విజయానంద తీర్ధ స్వామీజి వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్న జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు తదితరులు

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

(సత్యంన్యూస్, లావేరు)

మండలం లక్ష్మీపురం గ్రామంలోని సచివాలయం వద్ద శుక్రవారం నెల్లిమర్ల మిమ్స్ జనరల్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కొల్లి ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ కాగితాల కృష్ణారెడ్డిలు ప్రారంభించారు. వైద్య శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించిన 420 మందికి కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్, ఆర్థోపెడిక్, పల్మానాలజీకి చెందిన ప్రముఖ వైద్యులు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి శస్త్రచికిత్స కోసం హాస్పటల్‌కి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ ఆపరేషన్ మేనేజర్ కృష్ణకాంత్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రభుత్వ ఫించన్‌దార్లకు శుభవార్త

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ప్రభుత్వ ఫించన్‌దార్లు ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికేట్లను ఉప ఖజానా అధికారికి అందజేయాల్సి ఉంది. చాలామంది ఫించన్‌దార్లు నడవలేని, కదలలేని, అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యల వలన బయటకు రాలేని వారికి ఇంటివద్దకే వెళ్లి ఐరిష్ ద్వారా వారికి లైఫ్‌సర్టిఫికేట్లను ఇస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు కె.సోమసుందరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాశరావులు, జనరల్ సెక్రటరీ ప్రసాదరావులు తెలిపారు. జిల్లాలో ఈ సేవలు వినియోగించుకోవడానికి ఈ నెంబర్లకు 95022 49878, 994409 54954 కాల్ చేసి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే చాలావరకూ లైఫ్ సర్టిఫికేట్లను జారీ చేశామని, ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. సేవలు రాష్ట్రప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులకు మాత్రమేనని గమనించాలని, ఉచితంగా సేవ చేస్తున్నామని, ఎవ్వరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.



## నెంబర్‌ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గురువారం నగరంలో ఒకటవ, రెండవ పట్టణ, గ్రామీణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్సై, సీఐల ఆధ్వర్యంలో నెంబర్‌ప్లేట్లు లేని, అధిక శబ్దం కలిగించే సైలెన్సర్ గల వాహనాలు గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 41 నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, అధిక శబ్దం కలిగించే సైలెన్సర్ గల 5 వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. వాహన నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపిన, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దం చేసే సైలెన్స్ గల వాహనాలు నడిపిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 మండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఈ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# కమిషనర్ సుడిగాలి పర్యటన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రథసప్తమి సందర్భంగా నగరంలో జరుగుతున్న సుందరీకరణ పనులను కమిషనర్ దుర్గాప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుడిగాలి పర్యటన చేసి పనులు జరుగుతున్న తీరుపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉదయాన్నే మంచు కురుస్తుండగా కళింగ రోడ్డు ఆకస్మిక తనిఖీ చేసి చెత్తను తరలించే ప్రక్రియపై సూచనలిచ్చారు. పాతబస్టాండు నుంచి అరసవల్లి వరకు చెత్తను రోజుకు ఒకసారి కాకుండా నిరంతరం ఓ పక్కకు పోగెయ్యాలని సూచించారు. అనంతరం చల్లవీధిలో ఉన్న అన్న కేంటీన్‌ను, కిచెన్‌ను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌ను పరిశీలించి నాక్ బృందం పర్యటిస్తున్నందున మైదానాన్ని శుభ్రంగా ఉంచాలని, కళాశాలకు ఎ-గ్రేడ్ వస్తే జిల్లాలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రథసప్తమి ఏర్పాట్లు పరిశీలించారు. పార్కింగ్ కోసం వేస్తున్న అప్రోచ్ రోడ్లను, 80 అడుగుల రోడ్డులో నిర్మిస్తున్న తాత్కాలిక కల్వర్టు పనులను చూసి వేగవంతం చేయాలని కోరారు. పెద్దపాడు మెయిన్ రోడ్డును వెడల్పు చేస్తున్నందున అక్కడ జరుగుతున్న కాలువ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రథసప్తమికి రెండు రోజుల ముందుగానే కళింగ రోడ్డును సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.



# సొంత గనులే విశాఖ ఉక్కుకు ఆక్సిజన్

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది. దీనర్థం ఏదో ఒక ప్రైవేటు సంస్థకు దీనిని అమ్మేయడం. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్‌లోని కార్మిక సంఘాలన్నీ ఒక్కటై స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాటకమిటీ అనే పేరున అప్పటి నుంచి గత నాలుగేళ్లుగా ఉద్యమిస్తున్నారు. ప్లాంట్ వద్ద దీక్షా శిబిరాన్ని 2021 ఫిబ్రవరి 12 నుంచి నేటికీ నడుపుతున్నారు. మరో దీక్షాశిబిరం విశాఖ నగరం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నాటినుంచి నేటివరకు కొనసాగుతోంది.

నేడు స్టీల్ ప్లాంటు కష్టాలకు ప్రధాన కారణం దీనికి సొంత గనులు లేకపోవడమే. మేక్ ఇన్ ఇండియా వంటి గొప్ప నినాదాలు ఇస్తున్న నేటి ప్రభుత్వం మన ఇనుప ఖనిజాన్ని చైనా, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తూ, ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్‌కు మాత్రం కేటాయించ నిరాకరించడం ప్రభుత్వ నినాదంలోని డొల్లతనానికి నిదర్శనం. విచిత్రమేమిటంటే, ఒక్క విశాఖ స్టీల్ ప్లాంటుకు మినహా నేడు దేశంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని అన్ని స్టీల్ ప్లాంటులకూ సొంత గనులు ఉన్నాయి. సొంతగనులు లేకపోవడంతో ఈ ప్లాంటు ఇనుప ఖనిజాన్ని మార్కెట్లో కొనుక్కోవడం వలన, మిగిలిన ప్లాంట్ల కంటే టన్నుకు 4వేల నుంచి 8వేల రూపాయల వరకూ అదనంగా చెల్లించవలసి వస్తోంది. అయినా కూడా ఈ ప్లాంటు ఇటీవల వరకు లాభాలలోనే నడిచింది. గత నాలుగేళ్లుగా బొగ్గుతో సహా ముడి సరుకు సరఫరాలో అంతరాయాలు కల్పించడం, చివరకు దీని ఎగుమతులకు రైల్వే వేగన్లను కూడా సకాలంలో ప్రభుత్వం అందించకపోవడం, కావాలనే ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి నడపడం, మూడింటిలో రెండు బ్లాస్ట్ ఫర్నెసులను మూసివేయడం వంటి యాజమాన్య, ప్రభుత్వ ఉద్దేశపూర్వక చర్యల వల్ల నష్టాలను చవిచూడవలసి వచ్చింది. అందువల్ల నేటి ప్లాంట్ కష్టాలు మానవ దురుద్దేశపూరితమే తప్ప నిర్వహణ లోపం వల్ల వచ్చినవి కాదు.

వాస్తవంగా దేశంలోని మిగిలిన స్టీల్ ప్లాంటులకు లేని ప్రత్యేకతలు ఈ ప్లాంటుకు ఉన్నాయి. దేశంలోని సముద్ర తీర భారీ స్టీల్ ప్లాంట్ ఇది ఒక్కటే. దీనివల్ల ఉత్పత్తి ఎగుమతులు, ముడి సరుకుల దిగుమతులు సులభతరమవుతాయి. అదే సందర్భంలో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగి, తక్కువ మంది కార్మికులతో, మిగిలిన ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్ల కంటే ఎక్కువ ఉత్పాదకత సాధిస్తున్న ప్లాంటు ఇది.

రాష్ట్రంలో అతి పెద్ద భారీ పరిశ్రమ అయిన దీనిని కేంద్ర కుట్రల నుంచి కాపాడవలసిన నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆ పని చేయకపోగా పక్కలో బల్లెంలా దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్సెనల్ మిట్టల్ ప్రైవేటు స్టీల్‌ప్లాంటు నిర్మించాలని, దానికి అనుసంధానంగా పోర్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించడమే గాక, దానికి ఇనుప ఖనిజ గనులు కేటాయించాలని ప్రధానిని ఇటీవల కోరడం విశాఖ స్టీల్‌ను బలహీన పరచడంలో భాగంగానే భావించాలి.

ముందే చెప్పినట్లు, ఇతర స్టీల్‌ప్లాంటులకు లేని సముద్ర తీరం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉండడంతో పాటు, 22 వేల ఎకరాల సువిశాల భూభాగంతో మొత్తం నికర ఆస్తులు కనీసంగా మూడు లక్షల కోట్ల రూపాయల పైగా ఉంది. దీనిని ఎలాగైనా కారు చౌకగా పుస్తక విలువకు కాజేయాలని స్టీల్ కార్పొరేట్ దిగ్గజాలు దీనిపై కన్నేసాయి. వీరి సేవలో భాగమే నేటి కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ నిర్ణయం. ఈ ప్లాంటు కనుక లేకపోతే విశాఖ నగరాభివృద్ధి, ఉత్తరాంధ్ర అభివృద్ధి ఎండమావిగానే ఉంటుంది. వాస్తవంగా ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు ద్వారానే విశాఖ నగరం అభివృద్ధి చెంది, నేడు 25 లక్షల జనాభాతో ఆంధ్ర రాష్ట్రంలోనే అతి పెద్ద నగరంగా నిలిచింది. 682 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే మూడవ అతి పెద్ద నగరంగా కూడా నేడుంది. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో పారిశ్రామిక రాజధానిగా పేరుగాంచింది. 30వేల మంది ప్రత్యక్షంగా, మొత్తం లక్ష మంది విశాఖపట్నం స్టీల్ ప్లాంటుపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. దీనిపై ఆధారపడి అనేక చిన్న పరిశ్రమలు విశాఖ నగరంలో నడుస్తున్నాయి. ఇలా ఆర్థిక, సామాజిక రంగాలలో విశేష పాత్ర స్టీల్ ప్లాంట్ పోషిస్తోంది. 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అని 1966లో ఉవ్వెత్తున పోరాడి సాధించుకున్న పరిశ్రమ ఇది. ఇక్కడ నిర్మించవలసిన ఈ ప్లాంటును కర్ణాటక రాష్ట్రానికి తరలించాలని నాటి కేంద్రంలోని ఇందిరా గాంధీ ప్రభుత్వం యత్నిస్తే, దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం జరిగింది. 32 మంది ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారు. వేలమంది క్షతగాత్రులయ్యారు. నాడు 52 మంది కమ్యూనిస్టు శాసన సభ్యులతో సహా మొత్తం 67 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు తృణప్రాయంగా రాజీనామా చేసి, ఉద్యమంలో భాగస్వాములై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. వీరితో బాటు ఏడుగురు కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యులు కూడా తమ పదవులను త్యజించారు. నాటి ఉమ్మడి తెలుగు ప్రజలు రెండేళ్లకు పైగా సాగించిన మహోన్నత పోరాటం ప్రభుత్వాన్ని వణికించి వేసింది. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి, 1971లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఈ ప్లాంటుకు శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ, నిధులు ఇవ్వకపోవడంతో భూ సేకరణ, నిర్మాణం ప్రారంభం కాలేదు. మరలా ప్రభుత్వం మీద అనేక రూపాలలో ఒత్తిడి తేవడంతో నాటి జనతా పార్టీ ప్రభుత్వం నిధులు కేటాయించి భూ సేకరణ చేపట్టింది. నిర్మాణం కూడా త్వరిత గతిన సాగింది. 64 గ్రామాల ప్రజలు తమ ఊళ్లు ఖాళీ చేసారు. 16,500మంది చిన్న, సన్నకారు రైతులు తమ జీవనాధారమైన 22వేల ఎకరాల భూములను ఏమాత్రం సంకోచించకుండా త్యాగం చేశారు. వారిలో నేటికీ 6,500 మందికి నిర్వాసితులకు ఉపాధి కూడా లభించ లేదు. ప్లాంట్ నిర్మాణంలో 200 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. చివరకు 1991లో నాటి ప్రధాని పివి నరసింహారావు దీనిని జాతికి అంకితం చేశారు. అంటే దాదాపు రెండు దశాబ్దాల పోరాట ఫలంగా ఈ ప్లాంట్లో ఉత్పత్తి ప్రారంభమయింది. కానీ ఆది నుంచి అనేక బాలారిష్టాలను ఎదుర్కొంటూనే వస్తోంది.

ప్రపంచంలో పుష్కలంగా ఇనుప ఖనిజం లభించే దేశాలలో భారతదేశం ఒకటి. కేంద్ర ప్రభుత్వం మన దేశంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్లకు ఇనుప ఖనిజం వంద సంవత్సరాలకు సరిపడా కేటాయించింది. టాటా, భిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా వంటి స్టీల్ ప్లాంట్లు అన్నింటికీ ముడి ఖనిజం సమృద్ధిగా ఉంది. వారితో విశాఖ స్టీల్ పోటీ పడాలి. మార్కెట్‌లో అన్ని స్టీల్‌ప్లాంట్ల అమ్మకాల రేట్లు ఒక్కటే. మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ చట్టం 1957 సెక్షన్ 17(1)(బి) ప్రకారం ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటికి ముడి ఖనిజం గనులు కేటాయించాలని స్పష్టంగా వుంది. అందువల్ల విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపు ఒక హక్కు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణ సమయంలో 1985లో విడుదల చేసిన డీపీఆర్ ప్రకారం ఎన్ఎండీసీ (నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్), బైలదిలాలోని నాలుగు, ఐదు బ్లాకుల్లో సొంత గనులు విశాఖ స్టీల్‌కు కేటాయించాలి. అయినా నాటి నుంచి నేటి వరకు గనులు కేటాయించకపోవడం దురుద్దేశంతో కూడుకున్నది. దీన్ని కావాలనే నష్టాల లోనికి నెట్టి ప్రైవేటీకరించాలనే కుట్ర దీని వెనుక దాగి ఉంది.

సముద్ర తీరాన్ని ఆనుకుని ఈ ప్లాంట్ ఉండడంతో దీనికి అనుసంధానంగా దీని భూములలోనే గంగవరం పోర్టు కూడా నిర్మించాలన్నది అసలు ప్రతిపాదన. కానీ నాటి తెలుగుదేశం ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 1400 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కుని ప్రైవేట్ పోర్టుకు దారదత్తం చేసి, పోర్టును ప్రైవేటు సంస్థకు అప్పజెప్పింది.

# నోట్ల 'రింగు'లో డీడీ

(మొదటిపేజీ తరువాయి)

ఫిషింగ్ చేస్తే, ఆ ప్రాంతంలో చేపల ఆచూకీ లేకుండా పోతుందని 2005 ఆగస్టు 6న అప్పటి ప్రభుత్వం జీవో 384ను జారీచేసి రింగు వలల వినియోగాన్ని నిషేధించింది. దీనిపైనే ఇక్కడి మాదిరిగానే విశాఖ పట్నంలో రింగ్‌వలలు వాడుతున్నవారికి, సంప్రదాయ మత్స్యకారులకు మధ్య యుద్ధమే జరిగింది. తరచుగా వలలు తగులబెట్టుకొని శాంతిభద్రతలకు సమస్యగా కూడా తయారైంది. ఇప్పుడు అటువంటి వాతావరణం ఏర్పడకుండా చూడాల్సిన మత్స్యశాఖ అధికారి స్వయంగా సంప్రదాయ మత్స్యకారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

## ప్రజాప్రతినిధుల అండతో..

జిల్లాలో తీర ప్రాంతాల్లో ఉన్న 11 మండలాల్లో రింగు వలలను కొందరు మరబోటు యజమానులు వినియోగిస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా గ్రామాలు తీర్మానాలు చేసి రింగు వలలు వినియోగించడాన్ని నిషేధించాయి. అయితే కొన్నిచోట్ల రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో రింగు వలలతో చేపల వేట సాగిస్తున్నారు. వీరికి మత్స్యశాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారనేదే ఇక్కడ ప్రధాన అంశం. ఈ విషయాన్నే ఈ నెల 20న శ్రీకాకుళం మండలం పెద్దగనగళ్లపేట సర్పంచ్ ప్రజాగ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైకాపా హయాం నుంచి పెద్దగనగళ్లపేటకు చెందిన కొందరు రింగు వలలతో వేట సాగించేవారని, దీనిపై ఫిర్యాదు చేస్తే రెండు పర్యాయాలు గ్రామంలో సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకోకుండా విడిచిపెట్టేశారని కలెక్టర్‌కు వివరించారు. వైకాపా ప్రజాప్రతినిధుల సహకారంతో మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు అండదండలతో రింగు వలలతోనే యథేచ్ఛగా మత్స్యసంపదను కొల్లగొట్టారని పేర్కొన్నారు. ఇప్పటికీ వారు అదే పద్ధతిలో చేపల వేట కొనసాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మత్స్యశాఖ డీడీ ఏకపక్ష నిర్ణయాల వల్ల గ్రామంలో సుమారు 300 తెడ్డు బోట్లతో చేపల వేట నిర్వహిస్తున్న వెయ్యి మంది సంప్రదాయ మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని కలెక్టర్‌కు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ముందు కూడా మత్స్యకారులు తమ గోడు వెల్లబుచ్చుకోవడంతో ఆయన మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావును ప్రశ్నించినట్టు తెలిసింది.

గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో శ్రీకాకుళం రూరల్, మెరైన్ ఎస్ఐ, పోలీసు సిబ్బంది, డీఎఫ్‌వో, మత్స్యశాఖ డీడీ, పెద్దగనగళ్లవానిపేట గ్రామ పెద్దలు, మత్స్యకారులతో గురువారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన వారంతా ముక్తకంఠంతో రింగు వలలు నిషేధించాలని కోరినా మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్ మాత్రం రింగు లీడర్లకు వత్తాసు పలుకుతూ మాట్లాడారని హాజరైన సంప్రదాయ మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. తనకు 15 రోజుల సమయం ఇవ్వాలని, కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకువెళ్లి జిల్లా స్థాయిలో దీనికి పరిష్కారం చూపించాల్సి ఉందని డీడీ శ్రీనివాసరావు సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.

## పట్టుకొని.. విడిచిపెట్టారు

గార మండలం పరిధిలో బలరాంపురం, శ్రీకూర్మంకు చెందిన మత్స్యకారులు రింగు వలలను చేపలవేటలో వినియోగించడానికి వీల్లేదని తీర్మానించుకున్నారు. ఆ తర్వాత పెద్దగనగళ్లపేటకు చెందిన కొంద రింగువలతో వారి పరిధిలో చేపల వేట చేయడాన్ని గుర్తించి బలరాంపురానికి చెందిన మత్స్యకారులు అడ్డగించి రింగువలను స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. ఆ తర్వాత శ్రీకూర్మంలో కూడా ఇదే పద్ధతిలో వలను స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. ఆ తర్వాత వీరి మధ్య రాజీ కుదిరి వాటిని వెనక్కి ఇచ్చేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం రూరల్ మండలం కుందువానిపేటలో రింగు వలలను వినియోగించకూడదని గ్రామస్తులే తీర్మానించుకున్నారు.

## రింగు వలలంటే..


తరుచూ మత్స్యకారుల మధ్య వివాదానికి రింగు వలలు కారణమవుతున్నాయి. దీన్ని ప్రభుత్వం నిషేధించినా ప్రజాప్రతినిధులు, అధికారుల జోక్యంతో రింగు వలలను వినియోగిస్తున్నారు. మత్స్యకారులు వేట కోసం అనేక రకాల వలలను వినియోగిస్తుంటారు. వీటిలో రింగు వల, బల్ల వల, అల్లివల, పోస వల ఇలా అనేక వలలు ఉంటాయి. చేప రకం, వేట చేసే స్థలం, వేట చేసే సీజన్ బట్టి ఈ వలలను వాడుతుంటారు. కోనాం, సొర, వంజరం, కవ్వళ్లు, చందువ వంటి రకరకాల చేపలను పట్టేందుకు అనుగుణంగా ఈ వలలను వాడతారు. వలలు తయారు చేసేటప్పుడే అందులో ఏ సైజు చేప చిక్కాలి అనే లెక్కలేసుకుని దానికి తగ్గట్టుగానే వలకు పెట్టే ఖాళీ (నెట్ హోల్) సైజుని నిర్ణయిస్తారు. ఈ హోల్‌ను మత్స్యకారులు కళ్లు, అచ్చు, మెడ అని మూడు రకాలైన పేర్లతో పిలుస్తారు. పెద్ద చేపలను వేటాడే మత్స్యకారుల వలలో పడిన చిన్న చేపలు సముద్రంలోకి వెళ్లిపోయేలా వలల కళ్లు (కన్నాలు) పరిమాణం ఉంటుంది. ఎటువంటి చేపలనైనా పట్టేందుకు మిగతా వలల కంటే భిన్నంగా ఉండేవే రింగు వలలు. వలను సముద్రంలో వేసిన తర్వాత అది అటు ఇటు జరిగిపోకుండా, లేదంటే పైకి తేలిపోకుండా చేపలు చిక్కేందుకు వీలుగా గిన్నెలాగా ఉండేందుకు ఈ వలకు దిగువ భాగాన బరువుగా ఉండే రింగులను వేలాడదీస్తారు. అందుకే ఈ వలలను రింగు వలలు అంటారు. వీటిని కనీసం 10 నుంచి 15 బోట్ల సహాయంతో 30 నుంచి 50 మంది కలిసి సముద్రంలో వేస్తారు. దీంతో రింగువలలతో వేట చేసే పరిసరాల్లో సంప్రదాయ మత్స్యకారులకు చేపలు దొరకక జీవనోపాధిని కోల్పోతున్నారని మత్స్యకార సంఘాల నాయకులు చెబుతున్నారు.








# తోటాడలో పశువైద్య శిబిరం



(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

తోటాడ గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య, గర్భకోస వ్యాధి చికిత్స శిబిరం పశువైద్య సిబ్బందితో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 16 పశువులకు చూడు పరీక్షలు, 20 లేగదూడలకు నత్తల నివారణ మందులు, 24 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 32 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. తోటాడ గ్రామ సర్పంచ్ యర్నాగుల సునీత రామరాజు, మాజీ సర్పంచ్ యర్నాగుల సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతబొమ్మాళి పశువైద్యాధికారి కె.అప్పలసూరి, సంతబొమ్మాళి మండలం పారా వెటర్నరీ సిబ్బంది, పశు సహాయకులు, అటెండర్స్ గోపాలమిత్రులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.